క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్

రామచంద్రాపురం: విద్యాసామర్థ్యాల పరంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ టీచర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని గంగిరెడ్డిపల్లె పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతను, పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మేము సైతం..!



జేసీకి విరాళం చెక్కును అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిరుపతి అర్బన్: విజయవాడ వరద బాధితులకు తిరుపతిలోని సత్వ పాఠశాల విద్యార్థులు స్వచ్ఛందంగా విరాళాలు వసూలు చేసి రూ.52,287 చెక్కును జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు మంగళవారం కలెక్టరేట్‌లో అందజేశారు. జేసీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సత్వ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.కాంతారాణి, చక్రధర, మన్సి, పోషిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుపతి ఎంపీ గురుమూర్తి, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో వారిని సత్కరించారు.

శిక్షణతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న రాస్ డైరెక్టర్

తిరుపతి కల్చరల్: మహిళలు టైలరింగ్ శిక్షణలో నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకుని స్వయం ఉపాధితో కుటుంబాలకు ఆసరాగా నిలవాలని రాస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్ పిలుపునిచ్చారు. ఎస్‌టీవీ నగర్‌లోని శ్రీవిజ్ఞాన ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు మంగళవారం నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోహన్ మాట్లాడారు. శిక్షణ పొందుతున్న మహిళలు కుట్టిన డ్రెస్‌లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి, శిక్షకురాలు తులసి, ట్రస్ట్ కో- ఆర్డినేటర్ రేవంత్, మహిళలు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కానివ్వొద్దు: సీఐ

చంద్రగిరి: చంద్రగిరి పరిసరాల ప్రాంతాలలో ఉన్న యువత మత్తుకు బానిసలు కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రైవేటు వైద్యరంగం సిబ్బందికి ఉందని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ షాప్, ప్రైవేటు డాక్టర్లు, ఆర్ఎంపీలకు ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెడికల్ షాపులు, ప్రైవేటు ఆస్పతుల్లో డాక్టర్లు, సిబ్బంది, యువతకు మత్తు కలిగించే మాత్రలు, ఇంజెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, అలాంటివి తమ దృష్టికి వస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, జైలే గతి అని హెచ్చరించారు. మెడికల్ షాపులు, క్లినిక్స్, ప్రైవేటు ఆస్పత్రుల ముందు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐ అనిత, టీడీపీ నాయకులు రమేష్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో స.హ చట్టాన్ని పునరుద్ధరించండి

తిరుపతి కల్చరల్: టీటీడీ పరిపాలనలో మరింత పారదర్శకత పెంచడానికి సమాచార హక్కు చట్టాన్ని పునరుద్ధరించాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు కందారపు మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో స.హ చట్టం ద్వారా అనేక అవకతవకలను వెలికి తీసిన సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. తిరుమల కొండ జేఈవో కార్యాలయం నుంచి వీఐపీలకు ఇచ్చే దర్శనాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ప్రకటించాలని, ఇవన్నీ సమాచార హక్కు పరిధిలోకి వచ్చినప్పుడే నియంత్రణ ఉంటుందని, ప్రతి రోజూ దర్శనాల వివరాలు, వీఐపీల వివరాలను వెల్లడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

దేవుడిని అడ్డు పెట్టుకుని రోడ్డు కబ్జా!



రోడ్డు చివరి స్థలంలో వినాయక చవితి మండపానికి వేసిన షెడ్

తిరుపతి సిటీ: కబ్జాల పర్వంలో కూటమి నేతలు కొత్త పుంతలు తొక్కుతున్నారు. రోడ్డును కబ్జా చేసేందుకు ఏకంగా ఏకంగా నమూనా ఆలయాన్ని నిర్మించేశారు! వివరాలు.. తిరుపతి అర్బన్ పరిధిలోని పోస్టల్ కాలనీలో 4వ వార్డులోని పబ్లిక్ రోడ్డును గుడి పేరుతో కాజేసేందుకు కూటమి నాయకులు పక్కా స్కెచ్ వేశారు. ఈ మేరకు గుడి నిర్మించాలని కాలనీ వాసులను తిరుపతిలోని పలు సంఘాల అభ్యర్థులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వాస్తవానికి అది ఓ డెడ్ ఎండ్ రోడ్డు. దాని పక్కన అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాలకు చెందిన యజమాని స్థలం ఉంది. దానిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు స్థానికుల సమాచారం. అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు తాత్కాలికంగా వేసుకున్న ఓ గదిని అడ్డు పెట్టుకుని తొలుత స్థానికులు, కుల సంఘ నాయకులతో కలిసి వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు గుడి నిర్మాణం పేరిట పక్కన స్థలం యజమానితో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇది తెలుసుకున్న మున్సిపల్ అధికారులు ఆ షెడ్‌ను తొలగించాలని పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిమజ్జనం అనంతరం తొలగిస్తామని చెప్పి అలానే ఉంచేశారు. తాత్కాలిక షెడ్‌ను తొలగించేందుకు మంగళవారం అక్కడికి చేరుకున్న మున్సిపల్ సిబ్బందిని అడ్డుకుని వెనక్కి పంపించారు. దీంతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

'మాక్'కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు



అవార్డు అందుకున్న ట్రెక్కింగ్ బాలు

తిరుపతి కల్చరల్: తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ట్రెక్కింగ్ సంస్థ మోజాయిక్ అడ్వెంచర్ కమ్యూన్స్(మాక్)కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు లభించింది. తిరుపతి పరిసరాలలో 155 వారాల ట్రెక్కింగ్ కార్యక్రమాలను మాక్ నిర్వహించింది. సన్ రైజ్ ట్రెక్‌ల పేరిట ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు తిరుపతి చుట్టు పక్కల ఉన్న చిట్టడవులు, కొండకోనలు, సెలయేళ్లు, జలపాతాలు, ప్రాచీన స్మృతి చిహ్నలను దర్శించే ఏర్పాట్లు చేసి చరిత్ర మాక్‌దే. యువతలో సాహస ప్రవృత్తి పెంపుదల, పర్యావరణ, కళల పట్ల చైతన్యం కోసం సుమారు 35 ఏళ్ల క్రితం ట్రెక్కింగ్ ఆరంభించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో మాక్ ఆర్గనైజర్ బి.బాలసుబ్రమణ్యం(ట్రెక్కింగ్‌బాలు)కు ఈ సంస్థ అవార్డు, ప్రశంసా పత్రం, మెడల్ అందజేసింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మాక్ నిర్వాహకులను అభినందించారు.

పాతసర్వీస్ రోడ్డులోనే బస్సులు నడపరూ!

- ఆర్టీసీ ఈడీకి స్థానికుల వినతి
- బైపాస్ రోడ్డులోకి వెళ్లడానికి ఇక్కట్లు

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలంలోని దిగువ మల్లవరం మీదుగా పాత సర్వీస్ రోడ్డులోనే ఆర్డినరీ ఆర్టీసీ సర్వీసులను నడపాలని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు, డాక్టర్ కోదండ రామిరెడ్డి, డాక్టర్ పార్థసారధి నేతృత్వంలో మంగళవారం తిరుపతి జిల్లా కార్యాలయంలో ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. స్టాపింగ్ ఉండే ఆర్డినరీ సర్వీసులు సైతం కొత్త బైపాస్‌రోడ్డు మీదుగా వెళుతున్నాయని, దీని నిత్యం తిరుపతి, శ్రీకాళహస్తితోపాటు పలు ప్రాంతాలకు వెళుతున్న విద్యార్థులు, స్థానికులు బైపాస్ రోడ్డులోకి వెళ్లడానికి ఇక్కట్లు పడుతున్నారని వివరించారు. ప్రధానంగా ఆస్పత్రులకు వెళుతున్న పలువురు వృద్ధులు బైపాస్ రోడ్డు వద్దకు వెళ్లి ఆర్డినరీ సర్వీసులు ఎక్కాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై చెంగల్‌రెడ్డి స్పందించారు. జిల్లాలోని అన్ని డిపో మేనేజర్లు ఆర్డినరీ సర్వీసులను దిగువ మల్లవరం మీదుగా పాత సర్వీస్‌రోడ్డు మార్గంలో వెళ్లేలా ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.

సేవా దృక్పథంతో ముందుకు..



మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు, విద్యార్థులు



ఎస్వీయూలో నిర్వహించిన ర్యాలీ



ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో..

తిరుపతి సిటీ: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకుపోవాలని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ పిలుపునిచ్చారు. కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షత వహించి ప్రిన్సిపల్ మాట్లాడారు. శిక్షణ పొందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

ఎస్వీయూలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అలాగే మహిళా వర్సిటీలో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలోనూ ఇదే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ రమణ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పట్టుదలతో లక్ష్య సాధన

– టీటీడీ డీఈఓ నాగరాజ నాయుడు



విద్యార్థి సంఘం నాయకురాళ్లతో టీటీడీ డీఈఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజ నాయుడు అన్నారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థి సంఘం ప్రారంభించి విద్యార్థినులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ కళాశాలలో ఈ-క్లాస్ రూమ్‌ను ప్రారంభించి మాట్లాడారు. టీటీడీ విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని పిలుపునిచ్చారు. ఈ క్లాస్ రూమ్‌కు ఎల్ఈడీ టీవీని వితరణ చేసిన సంతోషిమాత ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ప్రసాద్‌రావు, సతీష్, చంద్రశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ, ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ మధుబాల, శ్రీపద్మావతి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనంత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ముగిసిన బదిలీల ప్రక్రియ

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీల ప్రక్రియ దాదాపు ముగిసింది. ఇప్పటికే ఎస్ఈ మోహన్ నెల్లూరు సర్కిల్ ప్రజారోగ్య విభాగానికి అయ్యారు. ఆయనతోపాటు ఎంఈలు చంద్రశేఖర్ చుడా ఈఈగా, వెంకట్రామిరెడ్డిని చిత్తూరు నగరపాలక సంస్థ ఈఈగా బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా మంగళవారం డీఈ, ఏఈ స్థాయి అధికారుల బదిలీలు జరిగాయి. డీఈ సంజీవకుమార్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ డీఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి నుంచి ఆర్.లలితను నియమించారు. మరో డీఈ ఏ.విజయకుమార్‌రెడ్డిని కళ్యాణదుర్గం మున్సిపల్ డీఈగా బదిలీ చేయగా, ఆయనస్థానంలో చిత్తూరు నగరపాలిక నుంచి రమణను నియమించారు. తిరుపతి నగరపాలికకు చెందిన డీఈ శ్రావణి చిత్తూరు నగరపాలక సంస్థ డీఈగా బదిలీ కాగా అక్కడి నుంచి వెంకటప్రసాద్ తిరుపతికి వచ్చారు. డీఈ రవీంద్రరెడ్డి నగరికి బదిలీ కాగా ఆయన స్థానంలోకి మధుకుమార్ నంద్యాల నుంచి వస్తున్నారు. నగరపాలిక ఇన్‌చార్జ్ డీఈ (ఎలక్ట్రికల్) నరేంద్రకుమార్ రాజంపేట మున్సిపల్ ఏఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి రాజంపేట నుంచి శిల్ప బదిలీ అయ్యారు.

రుయాలో పొగాకు వాడుక నిర్మూలన కేంద్రం ప్రారంభం



రుయాలో పొగాకు వాడుక నిర్మూలన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారులు



స్విమ్స్‌లో పొగాకు రహిత ప్రచారం 2.0 ప్రారంభంలో పాల్గొన్న వైద్యులు

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రి ప్రాంగణంలో పొగాకు వాడుక నిర్మూలన కేంద్రాన్ని మంగళవారం ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖరన్, రుయా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జె.రాధ ప్రారంభించారు. అలాగే, న్యూఢిల్లీ లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ ఆడిటోరియం నుంచి ఈ కేంద్రాన్ని వర్చువల్ పద్ధతిలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ యూనియన్ మినిస్టర్ ప్రతాప్ రావుగణపతి రావు జాదవ్ ప్రారంభించి మాట్లాడారు. యువత పొగాకు, మత్తు పదార్థాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఇక్కడ వైద్యం, నికోటిన్ గమ్స్, నికోటిన్ ప్యాచెస్, పొగాకు అలవాట్లు నియంత్రించడానికి మందులు ఇస్తారన్నారు. నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం కింద ఈ కేంద్రంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ హెచ్. హేమచంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, మానసిక విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జునరావు, మానసిక వైద్య నిపుణులు, రుయా ఆసుపత్రి ఏ ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మానసిక వైద్య, కౌన్సిలర్లు అలేఖ్య, సామాజిక కార్యకర్త అరుణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో మంగళవారం ఉదయం కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వర్చువల్ పద్ధతిలో 'యువత కోసం పొగాకు రహిత ప్రచారం 2.0'ను ప్రారంభించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. కార్యక్రమాన్ని సైకియార్టీ విభాగాధిపతి డాక్టర్ గణేష్ కుమార్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, సైకియార్టీ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ దుర్గాంజలి, అసిస్టెంట్ డైరెక్టర్ శశికళ, సూపరింటెండెంట్ ధనలక్ష్మి, జూనియర్ డాక్టర్లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు.

నిబంధనల మేరకు లేఔట్లకు అనుమతులు

- తుడా ఉపాధ్యక్షులు మౌర్య



లేఔట్లలో పరిశీలిస్తున్న తుడా ఉపాధ్యక్షులు మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఔట్లకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని ఉపాధ్యక్షులు ఎస్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం తుడా పరిధిలోని రేణిగుంట, వడమాలపేట, చంద్రగిరి వద్ద ఏర్పాటు చేసిన లేఔట్లలో కల్పించిన వసతులను తుడా అధికారులతో కలసి ఆమె పరిశీలించి మాట్లాడారు. తుడా పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఔట్లకు అధికారులు స్వయంగా వెళ్లి, ప్లాన్ ప్రకారం అన్ని ఉన్నాయా, లేవా? అని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా లేఔట్‌లో ప్లాట్ల మధ్య రోడ్లు, డ్రైన్లు, బహిరంగ స్థలం, లైట్లు, నీటి సౌకర్యం ఉందా? అని పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా లేని లేఔట్లకు అనుమతులు మంజూరు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఓ దేవి కుమారి, ఏపీఓ సూర్యనారాయణమ్మ, జేపీఓలు, ఇతర ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న చింతమాకుల పుణ్యమూర్తి

తిరుపతి కల్చరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి దళితుల మనోభావాలను దెబ్బతీసిన ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును వెంటనే అరెస్ట్ చేయాలని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి డిమాండ్ చేశారు. రఘురామ దుశ్చర్యను ఖండిస్తూ మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో దళిత ఓట్లు దండుకునే నాయకులు అధికారం బలంతో దళితులపై దాడులు చేయడం, కించపరిచే వ్యాఖ్యలు చేయడం హేయమని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం నేత ఎల్.సుబ్రమణ్యం, అరుణ, మహేష్, అంబేడ్కర్ యువజన సంఘ నేతలు పాల్గొన్నారు.

నదుల పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ: నదుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ అన్నారు. మంగళవారం పద్మావతి మహిళా డిగ్రీ/పీజీ కళాశాలలో భూగోళ శాస్త్ర విభాగం, 5ఏ ఆంధ్ర గర్ల్స్ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రపంచ నదుల దినోత్సవం నిర్వహించారు. దీనిపై ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ప్రిన్సిపల్ మాట్లాడారు. నదులు మానవాళి జీవనాధారమైనవని, వాటిని కలుషితం చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జాగ్రఫీ విభాగాధిపతి డాక్టర్ సీ.సుజాతమ్మ, అటానమస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కే.ఉమారాణి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సీ.భువనేశ్వరిదేవి, ఎన్‌సీసీ ఆఫీసర్ సుహాసిని, డాక్టర్ ఆర్ శ్యామల, డాక్టర్ వరప్రసూన, విద్యార్థినులు పాల్గొన్నారు.

పొదుపుపై విద్యార్థినులకు అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ ఎల్‌డీఓ పూర్ణిమ, లీడ్ బ్యాంకు మేనేజర్ విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పూర్ణిమ మాట్లాడుతూ, విద్యార్థినులు చిన్నతనం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని కోరారు. డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, కామర్స్ విభాగాధిపతి మల్లేశ్వరి దేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హాస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో మంగవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యక్షుడిగా హరిదాసు, జనరల్ సెక్రటరీగా షణ్ముగం, ట్రెజరర్‌గా క్రిష్ణమూర్తితో పాటు 22మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

తల్లిదండ్రుల చెంతకు శ్రీకాకుళం బాలుడు



తండ్రితో ఉన్న బాలుడు

తిరుపతి క్రైమ్: శ్రీకాకుళంకు చెందిన ఓ బాలుడు హాస్టల్ నుంచి పరారై తిరుపతికి రాగా తిరుపతి వెస్ట్ పోలీసులు అతన్ని తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. వెస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన నిరంజన్‌రావు కుమారుడు విశాఖపట్నంలో ఎనిమిదో తరగతి చదువుతూ హాస్టల్లో ఉండేవాడు. సోమవారం హాస్టల్లో ఎవరికీ చెప్పకుండా తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు రైల్లో తిరుపతికి చేరుకున్నాడు. అలిపిరి వద్ద ఒంటరిగా వెస్ట్ పోలీసులకు కనిపించగా బాలుడిని పోలీసులు ఆరా తీశారు. దీంతో బాలుడు తన వివరాలు వారికి తెలిపాడు. వెంటనే పోలీసులు అతని తల్లిదండ్రులకు సమాచారం అందించి బాలుడిని సురక్షితంగా వారికి అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సాంకేతికతతో రైతులకు అధిక ఆదాయం



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త రామ్‌కుమార్

తిరుపతి కల్చరల్: వ్యవసాయంలో నూతన సాంకేతికత విధానాలను అవలంబిస్తే రైతులు అధిక ఆదాయం ఆదాయం పొందవచ్చని కేవీకే విస్తరణ శాస్త్రవేత్త టి.రామ్‌కుమార్ అన్నారు. రాస్ సంస్థ మంగళవారం నిర్వహించిన రైతు రుణమేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం చేస్తున్న కార్యక్రమాలను, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత వినియోగం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రొంపిచెర్ల, పులిచెర్ల, చిన్నగొట్టిగల్లు నుంచి 150 మంది రైతులు, రాస్ సిబ్బంది నాగేశ్వరరావు, వనజ, సీవీ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీములస్థాన ఎల్లమ్మ మండల పూజా కార్యక్రమాన్ని మంగళవారం ఆలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ కుంభాభిషేక మహోత్సవం నిర్వహించి 41 రోజులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో మండల పూజ, హోమం, ప్రత్యేక కైంకర్యాలను నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పేరయ్య శాస్త్రి జయంతి వేడుకలు



తిరుపతి సిటీ: ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో వ్యవస్థాపక ఆచార్యులు ప్రొఫెసర్ ముక్కపల్లి పేరయ్య శాస్త్రి 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి ఆ విభాగాధిపతి బి.సరోజమ్మ, అధ్యాపకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన స్టాటిస్టిక్స్ విభాగానికి చేసిన సేవలను స్మరించారు. పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంపై అవగాహన



దేవరకొండలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

భాకరాపేట : లాభసాటి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారులు ధనలక్ష్మి, ఖాదర్‌బాషా కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ, చిట్టిచెర్ల పంచాయతీల్లో, ఎర్రావారిపాళెం మండలం చెరుకువారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. మట్టి నమూనాల సేకరణ, వివధ పంటల్లో విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలు ఇత్యాది వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు విజయ్‌కుమార్, నాగచెంగమనాయుడు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.